స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీ


తంబళ్లపల్లె : ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ మునికుమార్


పీలేరు పట్టణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీ


కలికిరిలో మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం


గుర్రంకొండలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


కేవీపల్లె : స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కలికిరి : స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మహమ్మద్ రియాజుద్దీన్ ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయం ముందు చలివేంద్రం, వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అలాగే స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సురేంద్రబాబు, మండల పరిషత్ ప్రత్యేకాధికారి మధుసూదన్, రిసోర్స్ కోఆర్డినేటర్ శంకర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాల్, ఏపీఎం దేవసేన, ఏపీవో మంజుల, వైద్యాధికారులు ఉదయ్‌కిరణ్, శశికుమార్‌రాజు, మురళి, పంచాయతీ, ఐసీడీఎస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్యం పాటించాలి

పీలేరు : ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్యం పాటించాలని ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్ అన్నారు. శనివారం పీలేరు పట్టణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తా చెదారం ఎక్కడపడితే అక్కడ వేయరాదన్నారు. గ్రామ పంచాయతీ వాహనాల్లో మాత్రమే వేయాలని సూచించారు. విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. బీట్ ద హీట్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యం

తంబళ్లపల్లె : మండలంలో ప్రజలందరి భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర సాధ్యమవుతుందని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని అన్ని ఆరోగ్య ఉపకేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. కోసువారిపల్లెలోని పీహెచ్‌సీలో డాక్టర అనుపమ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చలివేంద్రాలు ప్రారంభించారు. పలు చోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో డాక్టర్ మునికుమార్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్యం

కేవీపల్లె : స్వచ్ఛత పాటించడం ద్వారా ఆరోగ్యంగా జీవించగలమని తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎంపీడీవో సుధాకర్ అన్నారు. శనివారం మండలంలోని గ్యారంపల్లెలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తమవంతు బాధ్యతలు మొక్కలు పెంచి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సురేష్, సర్పంచ్ కె. రెడ్డెప్ప, ఎంపీటీసీ కె. సూర్యనారాయణరెడ్డి, ఏవో శ్రావణి, ఏఈలు మధుసూదన్, సుబ్రత్, హరి, ఏపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

గుర్రంకొండ : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని రాయచోటి డీఎల్‌డీవో లక్ష్మీపతి అన్నారు. శనివారం మండల కేంద్రమైన గుర్రంకొండలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర అన్న కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి బస్టాండులో మానవహారం నిర్వహించారు. అక్కడే అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ పరిసరాలతో పాటు వీధులు, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తద్వారా ఆరోగ్య ఆంధ్రను నిర్మించుకోవచ్చన్నారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగశివారెడ్డి, ఈవోపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ లాల్‌స్వామి, ఏపీఓ జయరామిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉచిత స్పోకెన్ ఇంగ్లిషు తరగతులు

మదనపల్లె సిటీ : ఉచిత స్పోకెన్ ఇంగ్లిషు తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పినాక ప్రజా సాధికార ట్రస్టు నిర్వాహకులు బండి రెడ్డప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో వచ్చే నెల 4వతేదీ వరకు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిగ్రీ చదువుతున్న, పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు తరగతులు జరుగుతాయన్నారు. ఉచిత స్టడీ మెటీరియల్‌తో ఆపటు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9490362039, 8919650270ను సంప్రదించాలని కోరారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

పెద్దమండ్యం : మండలంలోని దిగువపల్లె వైఎస్సార్ సీపీ నాయకుడు కానాల రమణారెడ్డి కుమారుడు, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కె. శివారెడ్డి, మర్రికుంట వనజ వివాహ వేడుకల్లో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ టి. రెడ్డిశేఖర్, మాజీ జడ్పీటీసీ గుర్రం రమేష్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం


మదనపల్లె గాంధీరోడ్డులో కురుస్తున్న వర్షం

మదనపల్లె సిటీ : మదనపల్లెలో శనివారం సాయంత్రం ఓ మోస్తరు పాటు వర్షం కురిసింది. ఎండవేడిమితో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు ఉపశమనం కలిగింది. వర్షానికి రోడ్లన్ని జలమయ్యాయి. బెంగళూరు బస్టాండు, ఎంఎల్ఎల్ ఆస్పత్రి, నిమ్మనపల్లె క్రాస్, ఆర్టీసీ బస్టాండు,కదిరిరోడ్డు ప్రాంతాలు జలమయ్యాయి.


మదనపల్లె డివిజన్‌లో శుక్రవారం రాత్రి కూడా ఓ మోస్తరు పాటు వర్షం పడింది. మదనపల్లె 1.6, కురబలకోట 47.4, నిమ్మనపల్లె 1, తంబళ్లపల్లె 6.4, పెద్దమండ్యం 60.8, ములకలచెరువు 1.6, పీటీఎం 2, బి.కొత్తకోట 6.2, రామసముద్రం 16.6,వాల్మీకిపురం 3.2, మి.మీ వర్షపాతం నమోదైంది.

కృష్ణమూర్తికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న కృష్ణమూర్తి

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె పంచాయతీ కురవపల్లెకు చెందిన మంచూరి కృష్ణమూర్తికి అనంపురం జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. శనివారం అనంతపురంలో జరిగిన జేఎన్‌టీయూ 14వ స్నాతకోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ సుదర్శన్‌రావు చేతులమీదుగా డాక్టరేట్ అందుకున్నారు. కృష్ణమూర్తి 'ఎల్‌సీ-ఎంఎస్ టెక్నిక్ ఉపయోగించి మూడు ఫార్మాస్యూటికల్ డ్రగ్స్‌లో జెనోటాక్సిక్ ఇంప్యూరిటీల పద్ధతి అభివృద్ధి, ధృవీకరణ, గుర్తింపు, పరిమాణీకరణ' అనే అంశంపై కెమిస్ట్రీ ప్రొఫెసర్, డైరెక్టర్ జీ.వి. సుబ్బారెడ్డి మార్గదర్శకత్వంలో పరిశోధనను 2022లో పూర్తి చేశారు.

వికసించిన మే పుష్పాలు



గుర్రంకొండ : పట్టణంలో మే పుష్పం వికసించింది. శనివారం స్థానిక కడపరోడ్‌లోని వెంకటరమణ ఇంట్లో ఈ పుష్పాలు వికసించాయి. ఏడాదికి కొకమారు వికసించే ఈ పుష్పాలు మేలో మాత్రమే ప్రత్యేకంగా వికసిస్తుంటాయి. ఎంతో ఆకర్షణగా ఉండే ఈ పుష్పాలు అందర్ని ఆకట్టుకొంటున్నాయి.

ఫైర్ ఆఫీస్ వద్ద చలివేంద్రం ప్రారంభం

మదనపల్లె రూరల్ : పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం వద్ద వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఫైర్ ఇన్స్‌పెక్టర్ శివప్ప తెలిపారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుభ్రత, స్వచ్ఛతపై సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రతతోనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

– డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి


మహిళలకు సూచనలు ఇస్తున్న డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి

నిమ్మనపల్లె : మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం బలంగా నిలబడుతుందని డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహిళల ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. మహిళలు స్వయంగా, ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం ఓసీ, బీసీ, మైనారిటీ మహిళలకు నెల రోజులు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్లను అందిస్తోందన్నారు. 144 మంది మహిళలు కుట్టు మిషన్లకు దరఖాస్తు చేసుకున్నారని, వీరిని రెండు బ్యాచ్‌లుగా విభజించి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలకు 80 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలన్నారు. మహిళలకు టైలరింగ్ పై పూర్తి అవగాహన, నైపుణ్యాన్ని పెంపొందించేలా శిక్షణ ఇవ్వాలని ట్రైనర్ సావిత్రమ్మకు సూచించారు. శిక్షణ పూర్తి అయిన తర్వాత ధ్రువీకరణ పత్రంతో పాటు కుట్టు మిషన్‌ను అందించడం జరుగుతుందన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్రీలక్ష్మీనరసింహుడికి విశేషపూజలు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆటోను ట్రాక్టర్ ఢీకొని ఆర్టీసీ కార్మికుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్ : ఆటో ట్రాక్టర్ ఢీకొనడంతో ఆర్టీసీ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈసంఘటన శనివారం మదనపల్లి మండలంలో జరిగింది. సీటీఎం-2 పంచాయతీ నేతాజీ కాలనీకి చెందిన రఘునాథరెడ్డి (55) మదనపల్లె ఆర్టిసి టు డిపో గ్యారేజీ లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. శనివారం విధులకు హాజరయ్యేందుకు సీటీఎంలో ఆటో ఎక్కి వస్తుండగా, జెర్సీ క్రీమ్ లైన్ డైరీ సమీపంలో ట్రాక్టర్ వేగంగా వచ్చి ఆటో ఢీకొంది. ప్రమాదంలో రఘునాథరెడ్డి తీవ్రంగా గాయపడగా, అదే ఆటోలో ఉన్న రమణమ్మ (40) స్వల్పంగా గాయపడింది. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. తాలుక పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ పి. మధు

కురబలకోట : కూటమి ప్రభుత్వం కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రోత్సహిస్తోందని ఎస్ఎఫ్ఐ ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీ పి. మధు విమర్శించారు. అంగళ్లు విశ్వం కళాశాలలో పది రోజుల పాటు జరిగే భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులను శనివారం అయన ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతుల్లో సామాజిక బాధ్యత విలువలు నేర్చుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్య వైద్య రంగాలను ప్రవేటీకరణ చేస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రశ్నించడంతో పాటు పోరాడాలన్నారు. చదువుతోపాటు ఉపాధి కేంద్రంలో ఖాళీ పోస్టుల భర్తీ కోసం ఉద్యమించాలన్నారు. ప్రధాన మంత్రి మోదీ రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తూ రిజర్వేషన్లు తుంగలో తొక్కుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుతామని ఎల్కేజి నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని చెప్పి ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలను ధ్వంసం చేసే పనిలో ఉందన్నారు. అంతేగాకుండా కార్పోరేట్ విద్యా సంస్థలను పక్కన పెట్టుకుని వాటిని ప్రోత్సహిస్తోందన్నారు. విద్యారంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందూ దొందేలా ఉన్నాయన్నారు. విద్యార్థులు చదువు సంధ్యలు కొనసాగిస్తూనే ప్రస్తుత రాజకీయాలపై అధ్యయనం చేసి సమాజ మార్పుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడ్వకేట్ సోమశేఖర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్సులు కె.ప్రసన్నకుమార్, ఏ.అశోక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్సులు ఎస్. నరసింహ, డి. రమణ, రైతు సంఘం రాష్ట్ర నాయకులు పి. శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌దాడుల్లో 13 లీటర్ల సారా స్వాధీనం

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్


ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

మదనపల్లె రూరల్ : ఎక్సైజ్ సిబ్బంది నిమ్మనపల్లె మండలంలో నిర్వహించిన దాడుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్టుచేసి, 13 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ భీమలింగ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.....నిమ్మనపల్లె మండలం బురుజుమాదిగపల్లెకు చెందిన కె.రెడ్డెప్ప కుమారుడు కే.రవి(46) నుంచి 6 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే నిమ్మనపల్లె మండలం దివిటివారిపల్లెకు చెందిన నారాయణ కుమారుడు చిన్నరెడ్డెప్ప(54) నుంచి 7 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. రెండుదాడుల్లో ఇద్దరిపై కేసులు నమోదుచేసి, రిమాండ్‌కు పంపామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా, డార్కస్, హెడ్‌కానిస్టేబుళ్లు మహమ్మద్‌ఆలీ, శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు వెంకటేష్, నాగరాజు, మధు, శివరాణిలు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్యులు

మదనపల్లె సిటీ : స్థానిక సొసైటీ కాలనీలోని విజయ భారతి పాఠశాలలో శనివారం బెటర్ లైఫ్ ఆయుర్వేదిక్ ఆస్పత్రి, పంచకర్మ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ దివ్య, డాక్టర్ దీప్తిలు దీర్ఘకాలిక రోగాలైన కీళ్ల నొప్పులు, నయాటిక, డిస్క్ ప్రొలాప్స్, జీర్ణకోశ సమస్యలు, చర్మరోగాలు, ఆస్తమా, అల్సర్, జీర్ణకోశ సమస్యలు వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 150 మంది పైగా రోగులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సిద్దారెడ్డి, మదనపల్లె ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ భానుప్రకాష్, అజమతుల్లా, డాక్టర్ సుందరం, దీపికాశర్మ, రూపేష్, ఇందుప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

నల్లవీరగంగాభవానికి పట్టు వస్త్రాల సమర్పణ


అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకువసున్న ధర్మకర్త మొర్రంరెడ్డి రామ్‌కుమార్‌రెడ్డి

కలికిరి (వాల్మీకిపురం) : పట్టణ పరిధిలో వెలసిన గ్రామదేవత నల్లవీర గంగాభవాని జారత మహోత్సవంలో భాగంగా శనివారం ఆలయ ధర్మకర్త మొర్రంరెడ్డి రామ్‌కుమార్ రెడ్డి అమ్మవారికి శాస్త్రోక్తంగా పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఆలయ పండితులు జనార్ధన్‌స్వామి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు స్వాగతం పలికి పట్టు వస్త్రాలు, పూజా సామగ్రిని అమ్మవారి ఎదుట ఉంచారు. సాయంత్రం గొల్లపల్లి దేవర ఇంటి వారి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో పాలపొంగు ఉత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయం 5.30 గంటలకు ఆలయ ఆవరణలోని గంగరాళ్ళకు 108 మంది మహిళలచే జలాభిషేకం కార్యక్రమం జరుగుతుందని ఆలయ ధర్మకర్త తెలిపారు. అనంతరం భక్తులు అమ్మవారికి దీలు బోనాలు సమర్పణ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ కోసూరి చంద్రమౌళి, రమేష్, రాజగోపాల్, మురళి, వేణు, విజయ్‌కుమార్, మహేష్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రకు పోలీసుల అడ్డంకులు


ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద కొనసాగుతున్న శోభాయాత్ర ర్యాలీ


శోభాయాత్ర నిర్వాహకులపై లాఠీఛార్జ్ చేస్తున్న పోలీసులు

- అనుమతి లేని మార్గంలో వెళ్లనిచ్చేది లేదన్న పోలీసులు
- బైక్ తాళాలు లాక్కుని వాహనాల నిలిపివేత
- నాలుగేళ్లుగా అలాగే వెళుతున్నామన్న నిర్వాహకులు
- ఇరువర్గాల మధ్య వాగ్వాదం, ఉద్రిక్త పరిస్థితులు
- టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా, పోలీసుల లాఠీచార్జ్

మదనపల్లె రూరల్ : హిందూ చైతన్య వేదిక 5వ వార్షికోత్సవం, హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం పట్టణంలో నిర్వహించిన ముందస్తు హనుమాన్ శోభాయాత్ర, బైక్ ర్యాలీలో పోలీస్ ఆంక్షల కారణంగా ఉద్రిక్తత నెలకుంది. శోభాయాత్రకు డీఎస్పీ అనుమతించిన మార్గంలోనే వెళ్లాలంటూ పోలీసులు పటుబట్టడంతో వివాదం మొదలైంది. నాలుగేళ్లుగా తాము వెళుతున్న మార్గంలో...ఇప్పుడు ఎందుకు అనుమతించరంటూ నిర్వాహకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు ర్యాలీలో వెళుతున్న బైక్‌లను అడ్డుకుని తాళాలు లాక్కోవడంతో ఘర్షణ వాతావరణం నెలకుంది. అయితే అప్పటికే ఆ మార్గంలో వెళ్లిపోయిన వందలాది వాహనాలను పోలీసులు మార్కెట్ యార్డు వద్ద, టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద అడ్డుకున్నారు. దీంతో హిందూ చైతన్యవేదిక, బీజేపీ నాయకులు పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుమీద ధర్నాకు దిగారు. దీంతో ఆగ్రహించిన వన్‌టౌన్ సీఐ ఎరీషావలీ, నిర్వాహకులపై లాఠీఛార్జ్ చేయడంతో వివాదం మరింత రాజుకుంది. లాఠీచార్జ్ కారణంగా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

ఘటనకు దారి తీసిన పరిస్థితులు :

పట్టణంలోని సొసైటీకాలనీ రామాలయం నుంచి సాయంత్రం 4 గంటలకు హనుమాన్‌శోభాయాత్ర ప్రారంభమైంది. ప్రారంభంలో... ట్రాఫిక్ ఎస్ఐ శివకామిని, రామాలయం వద్దకు వచ్చి డీఎస్పీ ఆదేశాల మేరకు బైక్‌ర్యాలీలో పాల్గొనే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పడం వివాదం రేగింది. హిందూ చైతన్యవేదిక, బీజేపీ నాయకులు.. శోభాయాత్ర ర్యాలీలో హెల్మెట్‌లు ధరించి పాల్గొనడమేంటని తిరగబడటంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. పోలీసులు, హిందూ చైతన్యవేదిక, బీజేపీ నాయకులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం జరిగింది. తర్వాత పోలీసులు వెళ్లిపోవడంతో.... శోభాయాత్ర బైక్‌ర్యాలీ ఎన్‌టీఆర్ సర్కిల్‌కు చేరుకుంది. ర్యాలీలోని సుమారు 200 వాహనాలు నీరుగట్టువారిపల్లె వైపు వెళ్లిపోయాయి. అదే సమయానికి ఎన్‌టీఆర్ సర్కిల్ వద్దకు చేరుకున్న పోలీసులు... చౌడేశ్వరి సర్కిల్ మీదుగా వెళ్లేందుకు అనుమతి లేదంటూ మిగిలిన వాహనాలను పోలీసులు అడ్డుకున్నారు. బైక్ తాళాలను పోలీసులు లాక్కుని, వాహనాలు వెనక్కి తిప్పే ప్రయత్నం చేశారు. నీరుగట్టువారిపల్లె మార్గంలో వెళ్లేందుకు డీఎస్పీ అనుమతి ఇవ్వలేదని, మల్లికార్జున సర్కిల్, సంతగేటు, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా వెళ్లాలని పోలీసులు చెప్పడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. హనుమాన్ శోభాయాత్రను అడుగడుగునా అడ్డుకుని ఆంక్షలు విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ టూటౌన్ స్టేషన్ ఎదుట బైఠాయించి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనకు దిగిన వారిని అదుపులోకి తీసుకుని వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్లతో పాటు డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, మదనపల్లెకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. హనుమాన్ శోభాయాత్రలో హిందూచైతన్య ప్రచారవేదిక అధ్యక్షులు బండి బాలాజీ, బండన్నస్వామి, బీజేపీ రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షులు సాయిలోకేష్, జిల్లా కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, ఆకులకృష్ణమూర్తి, వి.నారదరెడ్డి, రాటకొండ మధుబాబు, జనసేన రాయలసీమ కో కన్వీనర్ గంగారపు రామదాస్‌చౌదరి, బరినేపల్లె రవికుమార్, జర్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ హామీలతో మోసం

- రైతులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


టమటా రైతులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : రైతు మస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఎన్నికల ముందు కల్లబొల్లి మాటాలతో సూపర్‌సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం టమటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గోపిదిన్నె ,ఎద్దులవారిపల్లె పంచాయతీల్లో పర్యటించారు. టమాట రైతులతో చర్చించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో జగనన్న పాలనలో రైతులు రాజుగా ఉండేవారిని ఇలాంటి దుస్థితి ఎప్పుడు రాలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్నం పెట్టే అన్నదాత పడుతున్న కష్టాలు, నష్టాలు ఆవేదన కలిగిస్తోందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలపై ఆలోచించాలన్నారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, వైఎస్ ఎంపిపి కరీమ్, సర్పంచు రెడ్డినారాయణ, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీరాములు కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.